


# అర్ధరాత్రి

## శ్రీ గాలి బాలసుందరరావు

చూసే చూడడంతోటే సూర్యకాంతం మంచి సుకేకారంలాంటి పిల్ల అని తోచింది.

బండిదిగి, మా అత్తయ్య అందించిన నీళ్లతో కాళ్లు గడుక్కుంటూ వున్నప్పుడు, వాళ్ల దర్వాజాలో, అర్ధశరీరం మట్టుకు కనబడేటట్లుగా నుంచుని, ఆ అమ్మాయి నావంక చూసిన చూపుకు, నా పంచప్రాణాలూ చిందర వందరై పోయినయి.

ఆరూపం, ఆ రీవి, ఆ వాలకం, అన్నీ నన్ను ఆకర్షించి తదాయత్తుణ్ణిగా చేసుకోగా, యెడాతెరిపీలేని మా అత్తయ్య ప్రశ్న పరంపరకు, నేను ఏకపదసమాధానాలయినా యిచ్చానో లేదో!

ఆ వూళ్లో మా మామయ్యకు ఉద్యోగం. ఆయన మనుషులు బాగున్నారని కులభేదాలు పాటించక, ఒక కోమట్ల యింట్లో సగభాగం అద్దెకుతీసుకుని వుంటున్నాడు. ఏటాలాగే వేసంగి శలవుల్లో నాల్గునాళ్లు ఉండివద్దామని వాళ్లయింటికి వెళ్లాను.

మా అత్తయ్య ప్రశ్నలవర్షం వెలిసేక, మెల్లిగా, "మీ పొరుగువారెవరమ్మా?" అన్నాను.

ఆవిడ చాలాఅల్లరి మనిషి - అన్నియేళ్లు పైబడ్డా, అల్లరి తొణుకుతున్న ఆ రెండుకళ్లతో నాముఖ భావాల్ని కొళ్ళగిస్తూ "ఏం, కథ?" అంది.

నేను "ఎబ్బే! ఏమిలేదు. ఊరికే వేఅడిగాను. చూస్తే..." అత్తయ్య వెంటనే "ఊఁ! చూస్తే..." అంది.

"బ్రాహ్మల్లాగా లేరులే" అన్నాను, మెల్లిగా, తప్పించుకుందామని.

"ఏం లేకపోతే? బ్రాహ్మలు కాకపోతేనే నాంచిదిగా; నీకూ మీ మామయ్యకూ?" అంది ఆవిడ.

అయినా వూరుకోక, నేను మెల్లిగా ఆ విడచేత అన్నీ సంగతులూ చెప్పించాను.

ఆ అమ్మాయిపేరు సూర్యకాంతం. ఆవిడ తండ్రి రామయ్య, ఆ వూళ్లో పచారీ వర్తకుడు. బాగా డబ్బున్నవాడేకూడా. అయినా పీనాసితనంవల్ల అల్లుడికివ్వాల్సిన కట్నం సాంతంగా యివ్వలేదు. ఏవిధానా మామను తీసిపోని ఆ అల్లుడూ, ఆ డబ్బు పూర్తిగాయిస్తేనే గాని కార్యంచేసుకోనని భీష్మించుకు కూర్చున్నాడు. ఎన్నాళ్లు బిగబట్టుకు కూర్చుంటాడో చూస్తానని యితనూరుకున్నాడు. ఈ యిద్దరి పంతాలమధ్యా పడి నలిగి ఆ అమ్మాయి సౌఖ్యం నాశనమైపోతూంది. ఇప్పటికి ఆమె పెద్దమనిషై నాలుగేళ్లయింది.

రామయ్యకు పెద్ద బజారులో కొట్టే కాకుండా యింట్లో ఒకచిల్లర దుకాణంకూడా వుంది. సూర్యకాంతమే కొట్లో కూర్చుంటూ వుండేది. ఏ శుభముహూర్తాన అల్లా కూర్చోడం మొదలుపెట్టిందో, అప్పటినుంచి ఆ గల్లాపెట్టె ఖాళీగావున్న రోజులేదు. దగ్గరవున్న దుకాణాలన్నీ వదలి, ఎక్కడెక్కడ కాలేజీ కుర్రాళ్లూ, బఠాణీలూ, పిప్పరిమింటు బిళ్ళలూ, కొనుక్కొని చేయవలసినంత ఆలస్యంచేసి వెళ్లిపోతూ వుండేవాళ్లు. ఆ పరిసరాల్లోవున్న

పడుచు గృహస్థులు అవసరాలకు ఆ కొట్లోవచ్చి కూర్చుని, ఇళ్ళసంగతీ యింట్లో పెళ్లాల సంగతీకూడా మరచి పోయేవాళ్లు.

ఈ కథంతా చెప్పి అత్తయ్య "అయితే, ఏమాట కామాటే! ఇంతడబ్బు సంపాయిస్తూవున్నా ఆ పిల్ల యింత వరకూ అల్లరిమాత్రం పడలేదు." అని ఆ పిల్లచరిత్ర ముగించింది.

ఆ మాటా యీ మాటా చెప్పుకోవడంతో పది గంట లయింది. "మామయ్య ఆఫీసునుంచి వచ్చేటప్పటికి చాలా ఆలస్యమౌతుంది. నువ్వు భోంచేద్దువుగాని లే" అన్నది అత్తయ్య, స్నానానికి, తుండుగుడ్డ అందిస్తూ.

దొడ్లో బాదంచెట్టుక్రింద వేడినీళ్లు తోడివున్నాయి. నేను స్నానంచేస్తున్న చోటికి యెదురుగానే సూర్యకాంతం వాళ్ల వంటయిల్లు వున్నది. అప్రయత్నంగా ఆ వంకకుతిరిగిన నా కళ్లు, ఆ తడిక సందుల్లోనుంచి యెవరోనావంక చూస్తున్నారని కనిపెట్టినయి. ఆతడిక వెనకకదులుతున్న ఆ వ్యక్తి, సిల్ హౌట్ చిత్రంలాగా, నాకేదో, అవ్యక్త మధురమయిన ఆనందాన్ని కలిగించింది. ఎంతకూ ఆప్రక్కనుంచి నాకళ్లు మరలనే లేదు. తోముకున్న చెయ్యే తోముకున్నాను. చివరకు ముఖ్యమయిన మొహం తోముకోకుండానే, స్నానం ముగించి యింట్లోకి వచ్చి, భోజనముందర కూర్చున్నాను. నాతంతంతా చూస్తూవున్న అత్తయ్య వడ్డిస్తూ "ఏమయ్యా! మొహం తోముకోడం మరిచిపోయినావేం? మతి మతిలో వున్నట్లు లేదే చూస్తే?" అన్నది.

మాడు పగిలిపోయింది, ఆ రిమార్కుతో! అయినా తొణక్కుండా "అట్లాగా" అన్నాను.

మా అత్తయ్య అంతటితో ఆ విషయం వదిలిపెట్టి "ఏమయ్యా శంకరం! ఇంకా యెన్నాళ్లుంటావయ్యా, పెళ్లి జేసుకోకుండా" అన్నది.

"ఎందుకమ్మా పెళ్లి? యిప్పుడప్పుడే?" అన్నాను.

"అవునులే! ఎందుకు పెళ్లి?" అంది మూతితిప్పుకుంటూ.

ఏదో తింటున్నాన్నమాటే గాని, ప్రాణాలన్నీ ఆ పక్క యింట్లోవున్న వ్యక్తిమీదే వున్నాయి. చివరకు కుతూహలం ఆపుకో లేక "అయితే అత్తయ్యా! ఇక ఆ యమ్మాయిని మొగుడు యేలుకోనే యేలుకోడా యేమిటి?" అన్నాను.

"అట్లాగే అనుకోవాలి, సంగతులుచూస్తే. అయినా దాన్ని మొగుడే యేలుకోవాలని యేం నియామకం? ఇష్ట పడితే యేలుకుండేవాళ్లు చాలామంది వున్నారు - నీవంటి వాళ్లూ మీ మామయ్యలాంటివాళ్లూ"

"అదేమిటమ్మోయ్! నే నట్లాంటివాణ్ణి కాను" అన్నాను, చాలా 'సీరియస్'గా.

"ఏల్లాంటివాడివి కాకపోతే యిన్నాళ్లూ యిల్లా పెళ్లి లేకుండా తిరుగుతావూ! నాకు చెబుదూ?"

"అయితే పెళ్లికానివాళ్ళంతా యిల్లాంటివాళ్లేనంటా వేమిటి? ఖర్మ!?"

"ఆహా! ముప్పాతిక మూడువీసాలు"

గ్రంథం ముదురుతూందని గబ గబా భోజనం ముగించి వేశాను. కడుపేమీ నిండినట్లు లేదు. "చవి యెరుంగడు వడ్డించునవి యెరుగడు." అన్న విజయవిలాసంలో పద్యం జ్ఞాపకానికి వచ్చింది నాకు.

ఇంటిముందు వరండాలో పక్క వేసింది, అత్తయ్య - నేను కాస్సేపు పడుకుంటానేమోనని. - నాకు నిద్రబడుతుందా? పైగా నేను పడుకున్న భాగానికి యెదురుగుండానే కొట్టు.

అప్పటికా అమ్మాయి కొట్లోకి రాలేదు. ఆమె చరిత్రని గురించీ, దాని పర్యవసానాన్ని గురించీ, గడపలో అడుగుబెట్టగానే ఆ అమ్మాయి విసిరిన చూపును గురించీ, ఆలోచిస్తూ పడుకున్నాను. కొంచెం సేపటికి సూర్యకాంతం కొట్లోకి వచ్చింది. రాంగానే ఆ వాకిలిలో నుంచుని, క్షణంసేపు నావంక స్థిరంగా చూసి, ఛటుక్కున తలుపు వేసేసుకుంది.

ఆ చూపులో ఒక ఆవేదనా, ఒక ఆకలీ, ఒక ఆక్రోశమూ తాండవిస్తున్నాయి. ఆ ముతకచీరపమిటి మరుగులో నుంచి, నన్నడ్డుతూ మీ రెవ్వరన్నట్టుగా పొడుచుకు వచ్చిన ఆ రొమ్ములూ, నవనవలాడిపోయే ఆ శరీరమూ, ప్రత్యవయములో నించీ వెల్లివిరిసే ఆ యౌవనశోభా, నాలో యేదో భావాలతుపాను పుట్టించినయి. బజ్జీలలాంటి ఆ బుగ్గలు, నాలోవున్న రసికుణ్ణి పలహారానికి పిలుస్తున్న

ట్లుగా తోంచింది. ఆ విడ నాదృక్పథంలోనుంచి తొలగగానే నిస్సారమై పోయింది, యావచ్ఛరీరమూ. అసాధారణమైన ఆ చూపుకీ, వెంటనే ఆ తలుపు వేసుకోడానికీ, అల్లాగే ఆలోచిస్తూ, భావాల రాపిడితో వికలమయిన మనస్సును కుదటబరచుకుని కాస్త కునుకు బట్టించుకున్నాను.

సాయంత్రం అయిదింటికి బజారువేపు షికారు వెళ్లేను. బయిటికి పోవాలంటే ఆ కొట్టుదాటి పోవాలి. నాలుగడుగులు వేశాను. నా వీపుమీద యెవరో అదృశ్యములూ నిశితములూ అయిన బాణాలు గ్రుచ్చుతున్నట్టుగా తోచింది. వెంటనే తిరిగి చూశాను.

తీవిగా కూర్చుని, ఆ సోగకళ్ళతో సూర్యకాంతం, నా పోకడనే గమనిస్తోంది. నేను తిరిగి చూడడంతోటే మళ్ళీ తలవంచుకుంది. ఎందుకో వెళ్లి ఆవిణ్ణి పలకరింతామని బుద్ధిపుట్టింది. వెనక్కి తిరిగి ఆ కొట్టుముందుకు వెళ్లి "పిప్పరిమింటు బిళ్లలున్నయా?" అన్నాను.

సూర్యకాంతం మాట్లాడకుండానే, ఒక చిన్న చిరునవ్వు అధరమ్మీదనిలిపి, ఒక కన్ను కొంచెమ్మూసి ఓరగాపెట్టి చూస్తూ 'ఉన్నయ్యి' న్నట్టుగా తలత్రిప్పింది.

నేనుజేబులోనుంచి ఒక రూపాయితీసి "ఒక కానీ పిప్పరిమింటు బిళ్ళ లియ్యి" మన్నాను. సూర్యకాంతం తీవిగా, ఆ ప్రక్కనవున్న దేవదారుచెక్కల బీరువాలో వరసగావున్న హార్లిక్సు సీసాలలో ఒకటితీసి, చాలా ఒయ్యారంగా ఆ మూతతిప్పుతూ, 'కానీ బేరానికి రూపాయి మార్చడమా?' అన్నది.

మూగనోముపట్టిన మరదల్ని మాట్లాడించిన బావగారిలాగా ఆ అమ్మాయిచేత ఎట్లాగో మాట్లాడించినందుకు నేను సంతోషిస్తూ "కావలిసింది కానీ వస్తువయినా ఖర్చు చాలా చేయవలసి వుంటుంది మరి" అంటూ ఆసీసామీద చిందులుత్రొక్కే ఆ కొనదేలిన యెర్రని వేళ్లుచూస్తూ నిలబడి పోయినాను.

సూర్యకాంతం గుప్పెడు బిళ్ళలుతీసి పట్టండన్నట్లుగా చెయ్యి చాచింది, ఆ కళ్ళని నాకళ్ళమీద ఫోకస్ చేసి ఆక్షణంలో, ఆ యువతీమణి!

విశ్వంలోవున్న సర్వమాధుర్యరసాధిష్ఠాన దేవతలాగా ఆమె కనపడింది నాకు. చేతిలో ఆ బిళ్ళలుం పెడుతూ, మృదువుగా నా అరచేతిలోగోకి గబుక్కున చెయ్యితీసేసుకుంది.

నా వళ్లు పులకరించింది! నా ఆశ చిగురించింది!! నా నెత్తురు పొంగిపోయింది!



మెల్లిగా "ఉఁ హుఁ!" అన్నాను. ఆ అమ్మాయి మాట్లాడకుండా, చిల్లర యియ్యకుండా, గడ్డంకింద చెయ్యి మోపి కూర్చుంది.

నేను, మళ్ళీ, "యీకానీని బిళ్ళలూ రూపాయా! చిల్లరివ్వవేం" అన్నాను.

సూర్యకాంతం నిశ్చలంగా "ఇవ్వాలా?" అన్నది.

"పోనీ ఉంచుకో కావాలంటే" నన్నాను. ఆమాట ఘాటుగా అంటిందో యేమో వెంటనే పెట్టెలోనుంచి నే నిచ్చిన రూపాయితీసి నా చేతిలోపెట్టి "ఆ బిళ్ళల

ఖరీదు మీ రియ్యలేరు. హాయిగా తినండి నా పేరుచెప్పుకుని!" అన్నది. అంతలో యెవళ్లో ఆ కొట్టుదగ్గరకు వస్తున్నారు, బాగుండదని నే నక్కణ్ణుంచి వెళ్ళిపోయినాను - వాళ్ళని శపించుకుంటూ, ఆ మాటలు తలుచుకుని మురిసిపోతూ.

అటూ యిటూ తిరిగి యేడింటికి యింటికి చేరుకున్నాను. ఆఫీసులోపని మిగిలిపోయిందో యేమో మామయ్య అప్పటికింకా యింటికి రాలేదు. నేనంత తొందరగా రాననుకుని, అత్తయ్య ఆ పేటలో యెవరింటికో పేరంటానికి వెళ్లింది. సూర్యకాంతం కొట్లోవుంది. లాంతరు ముందరపెట్టుకొని వినోదిని చదువుకుంటోంది.

అభినేత్రికి యోగ్యమయిన ఆ పార్శ్వాకారమూ, తెలివితేటలు ప్రదర్శించే నాసికాగ్రమూ, నిమీలితములై ఆగ్రంథసారాన్ని ఆస్వాదిస్తున్న ఆ సమ్మోహనాస్త్రములైన కళ్ళూ నన్నెంతకంతకు బందీచేసుకున్నవి. పొంకమైన పమిటలోనుంచి పొడుచుకువచ్చే ఆ రొమ్ముకూ, మొగమ్మీద ఆటలాడుతున్న ఆ ముంగురులకూ, ఆ శిరోనగ శిఖరమ్మీద నుంచి అవతరించి, వీపనే మైదానంమీద నిడుపుగా పారి, ఉభయనితంబపర్వతమధ్య నిమ్నప్రదేశంలో నిలిచిపోయిన ఆ వినీలకుంతల నదీ ప్రవాహానికీ ఏ భావజ్ఞుడు బందీకాడు!

ఆ సౌందర్యాన్ని పరిక్షిస్తూ ఆ వరండాలో నిలబడిపోయినాను, పలకరిస్తుందేమోనని. ఊహూఁ! ఆవంచిన తల యెత్తలేదు! ఆ బిగించిన మూతి విప్పలేదు! కాస్త నిరుత్సాహినై ఆ తాళం కదిలిస్తూ చప్పుడు చేశాను. అప్పటికీ యేమి కదలిక లేదు. కాని యెందుకో ఆ యెర్రని పెదవులు ఒకదాన్ని ఒక అదుముకుని వచ్చేనవ్వు ఆపుకొంటున్నవి. ఆ నవ్వు పుట్టించింది, ఆ చదువుతున్న ఘట్టమో, అప్పటి నా అవస్థో నాకు తెలియలేదు. నేను పలకరిస్తేనే గాని ఆమె పలకరించేటట్లు లేదనుకొని "మా అత్తయ్య యింట్లో లేదూ?" అన్నాను, ఉపోద్ఘాత పూర్వకంగా.

ఆ పిల్ల నే నెప్పుడు పలకరిస్తానా అని యెదురుచూస్తోందనుకుంటాను. నే నామాట అనడంతోటే, ఆ పుస్తకం క్రింద పెట్టి, ఒయ్యారంగా నా వంక చూస్తూ, "ఆ ప్రక్కయింటికి పేరంటానికి వెళ్లేరు. తాళంచెవ్వి మీకిమ్మనారు" అంటూ లేచివెళ్లి ఆ తాళంచెవ్వి ఆ మండిగంమీద పెట్టింది. ఈతఫా చెయ్యందిస్తే యిక వదలననుకుందో యేమో!

తాళంచెవ్వి దగ్గిరుంచుకుని నన్నంతసేపు అల్లరిపెట్టిన పెంకితనానికి ఏమిచెయ్యాలో తోచలేదు నాకు. నేను తెచ్చిపెట్టుకున్న ముఖతీవ్రతతో, "మరి యింతసేపూ యియ్యలేదేం?" అన్నాను.

సూర్యం, ఆనవ్వు మళ్ళీనవ్వి, ఆ చూపు మళ్ళీచూసి "మీకు కావలసింది తాళంచెవ్వి అనుకోలేదు" అని తలవంచేసుకుంది.

ఆ దెబ్బతో నా యెరువుకోపం నాలోనిలబడలేకపోయింది. "బాగుంది. తాళంచేవి కాకపోతే తాళం కావాలనుకున్నావా?" అన్నాను నవ్వుతూ.

"ఏమో" అన్నది సూర్యం నిశ్చలంగా.

నా హృదయాకాశంలో ఆశా ఆనందమూ మెఱుపు మెరిసింది! ఆ గృహ కవాటాలు తెరుస్తూంటే నా ప్రేమ గృహకవాటాలు తెరుచుకోవడం వూహించుకున్నాను. లోపలికివెళ్లి మళ్ళీ వచ్చి బాతాఖానీ వేతామనుకున్నాను. ఇంతలో అత్తయ్య యింటికి వచ్చేసింది.

ఆ రాత్రి మామయ్య లేకుండానే అన్నం తినవలసివచ్చింది. అన్నం తింటున్నంతసేపూ, అత్తయ్య, 'అక్కడో సంబంధం ఉంది చేసుకుంటావా? ఇక్కడో సంబంధం వుంది చేసుకుంటావా? అంటూ వేధిస్తూనే వుంది. ఈడొచ్చిన పిల్లవాణ్ణిచూస్తే పెళ్ళియిందా అనీ, వయస్సువచ్చిన పిల్లనిచూస్తే, నెలతప్పిందా అనీ అడగకుండా వుండలేరు, వయసు మళ్ళిన కొంతమంది ఆడవాళ్లు

ఎట్లాగో, ఆ విడ ప్రశ్నలకు అనుగుణ్యంగా సమాధానాలు యిస్తూ తొందరగా భోజనంచేసి లేచాను. తాంబూలంవేసుకుంటూ ఆ వరండాలోనే అటూ యిటూ పచారుచేయడం మొదలెట్టాను. పండి వొరిగిన సస్యలక్ష్మిని కోసి కుప్పవేసుకోవడమెప్పుడా అని తొందరపడే రైతులాగా ఉంది నాపని. అంతలో అత్తయ్య "యింట్లో పడుకుంటావా? బయట పడుకుంటావా?" అని అడిగింది

"ఈ వేసం కాలంలో యింట్లో పడుకోవడమేమిట" న్నాను.

ఆ విడ "అవునులే! ఇంట్లో పడుకోవలసినరోజులు యింకా ముందున్నయి" అంటూ, పరుపుతెచ్చి వాకిట్లో పక్కవేసి, తెల్లని దుప్పటిపరిచి, తలక్రింద శాలువా పెట్టింది.

"ఇట్లా వుడికిపోతూవుంటే శాలువాయెందుకమ్మా ?" అన్నాను.

ఆవిడ "ఉంచుకో యెందుకైనా మంచిది. ఎంత వేసంగి అయినా అంతో యింతో చలివేస్తూనే వుంటుంది" అని లోపలికి పోయింది.

కాస్సేపయ్యాక మామయ్య వచ్చాడు. ఆయనతో తనివితీరా 'హస్కు'గొట్టి, వితండవాదం వేసుకుని వాలుగు చీవాట్లుతిని, మళ్లీ వాకిట్లోవచ్చి పడుకున్నాను.

మామయ్య కాస్త జబ్బువంటిచాడవడంచేత ఆయన యింట్లోనే పడుకున్నాడు. కాస్సేపటిలో యిల్లంతా మాటుమణిగింది.

ఆవేళ శుద్ధచతుర్దశి. ఆ నిర్మలాకాశంలో కించిద సంపూర్ణమైన చంద్రబింబం శీతలజ్యోత్స్నను వర్షిస్తూ వుంది. మందమనోజ్ఞమయిన మలయవాయువు వస్తోంది. ఆ పక్కా యీ పక్కా గెలలువేసిన కొబ్బరిచెట్ల ఆకులు టపటపా శబ్దం చేస్తూ మనస్సుకి హాయిగొల్పుతున్నవి.

ఆ వెన్నెలా, ఆ గాలీ, ప్రకృతి మనోజ్ఞనీలాంబరం మీద, ప్రజ్వలించి పోయే చంకీపువ్వుల్లాగా, ఆకాశమంతా నిండివున్న ఆ నక్షత్రాలూ, అనంతమై, అగాధమై, ఆనందం కలిగించే ఆ నిదాఘనిశీనిశ్శబ్దమూ, నన్ను ఎక్కడికో ఊర్ధ్వలోకాలలోకి యెత్తుకొని పోయినవి.

నాకు నిద్రపట్టలేదు. అల్లాగే ఆకాశంవంకే చూస్తు మందంగా శ్వాసలువిడుస్తూ పడుకున్నాను. ఆనతిదూరంలో వున్న కలెక్టరాఫీసులో గంటమాత్రం ఉండి ఉండి కొడుతూంది.

అంతలో నా మనోవీధిలో సూర్యకాంతం దైన్యమూ సుందరమయిన వదనమూ ప్రత్యక్షమయి మీటినవీణ తీగలాగా, లాగివిడిచిన వింటినారిలాగా నా నరాలు స్పందించి పోయినయి.

ఆ అమ్మాయి ఎవ్వరు ? నే నెవ్వరు ? ఏ బాంధవ్యమూ లేని ఆ పిల్ల తలపు నన్ను ఎందుకు కలవరపెడుతోంది ? ఇల్లాంటి ప్రశ్నలు వేలకు వేలు నా మనఃకుహరంలో పుట్టి, సరయిన జవాబు లేకుండానే అంతరించి పోతున్నయి.

ఆ పండు వెన్నెలలో ఆ చల్లగాలిలో, అమూల్యమయిన ఆ నిశ్శబ్దంలో వెడల్పయిన ఆ పట్టెమంచంమీది ఖాళీ ప్రదేశాన్ని నింపుతూ, సూర్యకాంతం, పడుకుని వుంటే, ఆ ముంగురులు నిమురుతూ, ఆ అధరాన్నీ, ఆ యెత్తైన రొమ్మునీ...

ఇట్లాగే యెన్నో కోరికలు, ఎన్నో భావాలు ! సముద్ర కెరటాలలాగా నా ఆలోచనలకి అంతూ పంతూ లేదు.

నాస్థితిచూస్తే నాకే నవ్వొచ్చింది. ఇకనైనా అనుగ్రహించమని నిద్రాదేవిని ఆహ్వానించాను.

విహ్వలుడైన రోగిని, డ్యూటీ అయిపోయిననర్సు డ్యూటీకి వచ్చిన నర్సుకి అప్పగించేలాగా, జాగ్రదవస్థ నన్ను నిద్రావస్థకు అప్పగిస్తోంది.

అంతలో ఆ పక్కతలుపు యెవ్వరో తెరిచిన చప్పుడయింది. గబుక్కున కళ్ళు తెరిచి చూశాను.

నా నరాలు తిమ్మిరెక్కిపోయినయి. రక్తనాళాల్లో వేడి రక్తము, మెదడు వేపుకు ప్రవహిస్తున్నది.

నా తపస్సుకు మెచ్చే వచ్చిందో, ఏదైనా పనిమీదే వచ్చిందో, సూర్యకాంతం తలుపు తెరిచి నేను పడుకున్న వేపు చూస్తోంది. బయట కాసే వెన్నెలవల్ల, ఆ పసారాలోవున్న అంధకారం కాస్త పలచబడింది. చీకటి వెల్తురూ కాని ఆ మందకాంతిలో ఆ అమ్మాయికళ్ళు, యెల్లా మెరిసిపోతున్నయ్యని ! ఆవిడ సంకోచంచూసి, నేను కొంచెంగా తలయెత్తి ఆ వంకకు చూశాను - మేలుకునే వున్నానని చెప్పున్నట్లుగా.

ఆ అమ్మాయి అక్కణ్ణుంచి కదలలేదు - సతీ సహజమయిన సంకోచమో, పత్నీ సహజమయిన భయమో! అనిమిషుణ్ణయి, శీఘ్రశ్వాసినయి, ఆ వంకేచూస్తూ పడుకున్నాను.

అల్లా అరనిముషం నుంచుని ఏదో నిశ్చయానికి వచ్చిన దానిలాగా "ఊహు !" అని ఆ మెరిసే కళ్లతో అటూ యిటూ చూసి మట్టెల చప్పుడు కాకుండా, మెల్లిగా అడుగులు వేస్తూ, మెట్లు దిగుతూంది.

నాకేమీ తోచలేదు. ప్రత్యక్షమయిన ప్రణయదేవతను చూచి చకితుడయిన భక్తుడిలాగా లేచి కూర్చున్నాను.

నదురూ బెదురూ లేకుండా "ఇంకా నిద్రపోలా ?" అంది, సూర్యకాంతం.

ఆ కంఠమాధుర్యం నా మెదడునుమళ్ళీ నా స్వాధీనానికి తెచ్చింది. మెల్లిగా "ఎట్లా పోతాను ?" అన్నాను.

సూర్యకాంతం, "ఏం" అన్నది సాలోచనంగా.

ఇక ఆపుకోలేక పోయినాను. ఛటుక్కున లేచాను. గమక్కున ఆ విడను నా వక్షానికేసి అదుముకుని, గబగబా, ఆ మొగాన్నీ, ఆ బుగ్గల్నీ, ఆ పెదిమెల్ని ముద్దెట్టుకుని, ప్రజ్వరిల్లిపోయే ఆ కళ్ళల్లో కళ్లుపెట్టి చూస్తూ నిశ్చేతనుణ్ణయి పోయినాను.



అంతలో నా శరీరంలో మళ్ళీ ఒక మోహాకెరటం లేచింది.

అనుక్షణ ప్రవృద్ధమయిన ఉద్రేకంతో, అంతవరకూ అనన్యానుభూతమయిన ఆ వక్షం రవికలోనుంచి పొడుచుకు వస్తోంది. ఆ పీన వక్షాన్ని చూసి; నేను కోలు పొలంలో ధాన్యరాసుల్ని చూసి, ఆనందించే అమాయక కర్షకుడిలాగా, ఏదో విచిత్రానందాన్ని పొందాను.

నా వెర్రి వుద్రేకానికి సూర్యకాంతం నవ్వింది. మెల్లిగా "ఉండండీ" అని, చేతిగాజులు పైకి తోసి, గలగల్లాడే మంగళ సూత్రాలు వీపుమీదకు వేసుకుని, చీరె సవరించుకుంటూ, 'యింట్లో యెవరైనా లేస్తారు!' అన్నది.

ఆ మాటతో నా అవ్యక్తతను నేను గ్రహించాను.

అటూ యిటూ ఒకమాటు చూశాను. ఆ రెండు, కొబ్బరిచెట్లూ గవర్నరు కోటముందు శిపాయీలలాగా జాగ్ర

త్తగా మాకు పహారా యిస్తున్నవి. ఆకాశాన వెలిగే నక్షత్రాలు మా విలాసాన్ని చూసి ముసిముసి నవ్వులు నవ్వుకుంటున్నవి. రహస్యమయిన యీ వ్యవహారం చూడ గూడదనుకున్నాడో యేమో చంద్రుడు ముఖంమీద మేఘో త్తరీయం కప్పుకున్నాడు. అంతలో నాకు అత్తయ్య తల క్రిందవుంచిన శాలువా సంగతి జ్ఞప్తికి వచ్చింది. అది విప్పి మా యిద్దరిమీదకూ వచ్చేట్లుగా కప్పేను.

మొదట్లో అర్థంలేనివి లాగా వున్నా, పెద్దవాళ్లు చేసే పనులు, చివరకు యిల్లాగే ఉపయోగానికొతియ్యాను కున్నాను.

* * *

ఆ మంట చల్లారిపోయింది. నా ఆలింగనబంధాన్ని కాస్త వదులుచేసి, ఆమెను కాస్సేపు యేడిపిద్దామను కుని "ఇంతపని చేస్తావనుకోలేదు" అన్నాను.

సూర్యం యింతయినా జంకకుండా "మీ రింతపని చేయ గలరని నేనూ అనుకోలేదు" అన్నది.

"ఎవరైనా చూస్తే యేమయ్యేది?"

"అమీ తుమీ తేలిపోయేది."

నిర్ఘాంతపోయి సూర్యంవంక నీరవంగా చూశాను.

"ఔను మరి. అందరిమొగుళ్ళలాగా ఆయనా నన్నూ చూసుకుంటూవుంటే, అందరిలాగా నేనూ పతివ్రతనై వుండేదాన్ని. ఇంట్లో సొమ్మంతా తగలేసుకుని దేశమంతా పరిపాలన చేస్తున్నాడు. ఆ తగలేసేడబ్బులో వెయ్యోవంతు లేదు; మా నాన్న యియ్యాల్సిన డబ్బు......పోనీయండి. యివ్వాళేమిటో, ఇట్లా బుద్ధి బుట్టింది..."

ఆ అమ్మాయి అనే ప్రతిమాటా నాలో యేదో విప్ల వాన్ని పుట్టించింది. చూస్తూ వూరుకున్నాను.

"అది కాదండి! మా నాన్న చేసిన తప్పుపనికి నన్నెం దుకూ శిక్షపెట్టడం? నన్ను చేసుకున్నారా? డబ్బుని చేసుకున్నారా? నాదీ మానవప్రాణమే! డబ్బిస్తేనేగాని తన మొఖమెవరు చూడరు. నేను తల్చుకుంటే నవమన్మథు లొస్తారు."

"ఏ నవమన్మథుడొస్తాడు నీకోసం?" అన్నాను. అల్లరికి.

"ఏ నవమన్మథుడైనా వస్తాడు. ఇప్పుడీ నవమన్మ థుడు రాలా?" అన్నది, వేళ్లతో నా బుగ్గలమీద మృదు వుగా పొడుస్తూ – అల్లరిగా మూతి తిప్పుతూ.

కోడి కొక్కురో మంది. గుండెలు గుభిల్లుమన్నయి. ఎంతత్వరగా గడిచిపోయింది రాత్రి!

సూర్యం లేచి, గోళ్లతో తల గీరుకుని, చీర సరీగ్గా కట్టు కుని పమిట సరీగ్గా సర్దుకుని, దీనంగా నా వంకచూస్తూ "మా అమ్మ లేచేవేళ అయింది. వెళ్తాను" అంది.

నాగుండె నెవళ్ళో గుప్పిటితో పిసికి వేస్తున్నట్లయింది. నేను లేచి, ఒణికిపోయే చేతుల్తో ఆ అమ్మాయిని మళ్ళీ ఒక్కసారి - ఆఖరుసారి - కౌగలించుకుని, ఒక ముద్దెట్టు కుని "సూర్యం! సూర్యం!! నువ్వెళ్తావా? వెళ్ళిపోతే నేను బ్రతకలేను. నువ్వేమి చెయ్యమంటే అది చేస్తాను..."

సూర్యం మెల్లిగా నా కౌగిలి విడిపించుకుంటూ "ఊరికే ఆవేదన పడకండి. నాకు మీరేమీచెయ్యవద్దు. హాయిగా పెళ్ళిచేసుకుని, - మాఆయనలాగా చేయక - ఆ అమ్మాయిని సుఖపెట్టండి. ఊఁ! వదలండి తెల్లారుతోంది పోతాను. జ్ఞాపకముంటానా?"

నిరుత్సాహంతో నాచేతులు జారిపోయినయి. ఆమె దీనంగా "రోజూ యిల్లా చేయలేము. రోజూ అవసరమూ వుండదు. వరదవస్తే గాని కట్టతెగదు. వరద రోజూ రానూ రాదు...ఊఁ! పోతా!" అని గబగబా గడపదగ్గ రకు వెళ్ళి, వెనక్కుతిరిగి, ప్రేమా, దైన్యమూ, తృప్తీ వెలిగక్కే చూపు నావంకచూసి మెల్లిగా తలుపువేసుకుని నా దృక్పథంలోనుంచి దాటిపోయింది.

ఆ రాత్రి శేషభాగాన్ని గడపడ మెట్లాగా అని పించింది.

మా అత్తయ్య యింతలో తలుపుతీసుకొని వచ్చింది పాచిపని చేసుకోడానికి. చూసింది నన్ను.

సహజమందస్మితముతో వుండే ఆమె ముఖము ఉత్తర క్షణములో ఎఱ్ఱబారిపోయింది. ఆడపులిలాగా నావంక చూస్తూ బిగబట్టి "ఊఁ హుఁ" అని అంది.

ఆమె ముఖంవంక చూడలేకపోయాను. చటుక్కున కళ్లుమూసుకొని ముసుగుపెట్టుకున్నాను.

మా మామయ్య వద్దంటూ వున్నా ఆ ఉదయమే ఆవూరునుంచి ఉడాయించాను.

---